నేడు డయల్ యువర్ ఆర్టీసీ కార్యక్రమం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ ప్రాంతీయ అధికారిణి జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4నుంచి 5గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ రీజినల్ సమస్యల కోసం 9959226011, ఆర్మూర్ 9959226019, బోధన్ 9959226001, నిజామాబాద్-1 9959226016, నిజామాబాద్-2 9959226017, కామారెడ్డి 9959226018, బాన్సువాడ 9959226020 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటి నిల్వలు

- యాసంగిలో 12లక్షల ఎకరాలకు సాగు నీరు
- 56 రోజుల్లో 42 టీఎంసీల నీటి వినియోగం
- ఇప్పటికే ప్రాజెక్టుల పరిస్థితిపై అధికారులతో సీఎం సమీక్ష
- ఏప్రిల్ 8 వరకు నీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు
- ఐదు జిల్లాల పరిధిలో వచ్చే జులై వరకు తాగునీటికి కూడా..
- నీరు వృథా కాకుండా అధికారులు చర్యలు
- కాలువల వెంట పర్యవేక్షణ
- నీటి వినియోగం, పొదుపుపై రైతులకు అవగాహన



నిజామాబాద్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉత్తర తెలంగాణలో కీలకమైన ఎస్సారెస్పీ ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. యాసంగిలో 12లక్షల ఎకరాలకు పైగా సాగు కోసం 55 రోజుల్లో 42 టీఎంసీల నీటిని వినియోగించారు. ఏప్రిల్ 8 వరకూ సాగుకు నీరందించాల్సి ఉండటంతో ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదల కొనసాగిస్తున్నారు. పెరిగిన ఎండలకు నీటి వినియోగం పెరుగుతోంది. అలాగే చివరి ఆయకట్టు వరకూ నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతోపాటు ఎక్కడా నీరు వృథా కాకుండా ఉండేందుకు కాలువల వెంట పర్యవేక్షిస్తున్నారు. ఆయా సెక్షన్ల పరిధిలోని నీటి వినియోగం, పొదుపుపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యాసంగి సాగుకు నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి సాగుకు నీటిని అందించడంతోపాటు జూలై వరకు తాగునీరు కూడా ఇవ్వాల్సి ఉండటంతో నీటి నిల్వలు ఉండేలా చర్యలు చేపడుతూనే పంటలకు విడుదల చేస్తున్నారు.



ఎస్సారెస్పీపైనే ఆ తొమ్మిది జిల్లాలు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో కాకతీయ కాలువ కింద నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఎస్సారెస్పీతో పాటు ఎల్ఎండీ, మిడ్ మానేరు ద్వారా ఈ పంటలకు నీటిని విడుదల చేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం కాకతీయ, లక్ష్మి, సరస్వతీ కాలువలతోపాటు గుత్ప, అలీసాగర్, సదర్‌మాట్ కింద 12 లక్షల ఎకరాలకు పైగా యాసంగిలో సాగైంది. ప్రాజెక్టు నుంచి యాసంగి సాగు కోసం డిసెంబర్ 25న నీటి విడుదల మొదలై విడతల వారిగా పంటలకు విడుదల చేస్తున్నారు. ఆన్‌ఆఫ్ పద్ధతిలో 8 రోజులు నీటిని విడుదల చేసి 7 రోజులు నిలిపివేస్తున్నారు. వేసవిలో వేసిన పంటలు పూర్తయ్యేంతవరకు ఏప్రిల్ 8 వరకు నీటి విడుదల చేయాలని నిర్ణయించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి స్టేజ్ 1 కింద డిసెంబర్ 25నుంచి యాసంగి సాగుకోసం నీటి విడుదలను చేపట్టారు.

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్‌లో 5.4 లక్షల ఎకరాలకు సాగునీరు

కాకతీయ కాల్వ ద్వారా జోన్-1, జోన్-2గా విభజించి ఎల్ఎండీ ఎగువన ఉన్న జగిత్యాల, కొరుట్ల, బాల్కొండ, చొప్పదండి, కరీంనగర్, ధర్మపురి, పెద్దపెల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని 5లక్షల 40వేల 171 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. గుత్ప, అలీసాగర్‌తో పాటు ఇతర ఎత్తిపోతల పథకాలకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు. సరస్వతి కాల్వ ద్వారా నిర్మల్, ఖానాపూర్, సదర్మాట్ కోసం నీటి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాల్వ జోన్-1, జోన్-2కు ఏప్రిల్ 8వరకు సాగునీటిని అందించనుండగా, ఇదే రీతిలో సరస్వతి, లక్ష్మీకాల్వలకు కూడా కొనసాగించనున్నారు. ఎల్ఎండీకి దిగువన కాకతీయ కాల్వ పరిధిలో హుజురాబాద్, పరకాల, భూపాలపల్లి, నర్సంపేట్, డోర్నకల్, మహబూబాబాద్, వర్ధన్నపేట్ నియోజకవర్గాల పరిధిలో 3లక్షల 61వేల ఎకరాలు సాగవుతోంది. ఈ ఆయకట్టుకు జనవరి 9న నీటి విడుదలను చేపట్టారు. మార్చి 31వరకు సాగునీటిని అందించనున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో 3.3 లక్షల ఎకరాలకు..

ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద వర్ధన్నపేట్, పాలకుర్తి, డోర్నకల్, పాలేర్, మధిర, తుంగతుర్తి, సూర్యపేట్, కోదాడ నియోజకవర్గం పరిధిలో 3లక్షల 36వేల 630 ఎకరాలకు సాగు నీటిని విడుదల చేస్తున్నారు. జనవరి 1 నుంచి నీటి మొదలుపెట్టగా మార్చి 31 వరకు ఈ నీటి విడుదలను కొనసాగించనున్నారు.

మిగిలింది 38.6 టీఎంసీలే..

వేసవి ఎండలు ఒకేసారి పెరగడంతో ఆయకట్టు (తరువాయి 8వ పేజీలో..)

విషాదం



- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

- అడవి పందుల వేటకు వెళ్లి.. విద్యుత్ షాక్‌కు గురై ముగ్గురి మృతి
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
- న్యాయం చేయాలంటూ మృతుల కుటుంబీకుల ఆందోళన
- మృతదేహాలను తన భుజస్కందాలపై ఒడ్డుకు చేర్చిన సీఐ



గంగారాం (ఫైల్)



బాలమణి (ఫైల్)



కిషన్ (ఫైల్)

బోధన్ రూరల్ / కోటగిరి / రెంజల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల వేటలో ఓ కుటుంబం మృత్యుతీరానికి చేరింది. పంటపొలంలో అడవి పందుల వేటకు వెళ్లి.. విద్యుత్ వైర్లకు తగిలి ముగ్గురు మృతిచెందిన విషాద ఘటన రెంజల్‌లోని సాటాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. జిల్లాలోని రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఓర్సు గంగారాం (45)కు బాలమణి (40), శీల అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య బాలమణికి ఇద్దరు కుమారులు కిషన్ (21), ప్రవీణ్, ఒక కుమార్తె యశోద ఉన్నారు. వీరంతా గత కొన్నేళ్లుగా అడవి పందులను వేటాడుతూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున గంగారాం.. తన భార్య బాలమణి, కుమారుడు కిషన్‌తో కలిసి అడవి పందులను వేటాడేందుకు బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామ శివారులోకి వెళ్లారు. అయితే పెగడాపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ రావు అనే రైతు పొలంలోకి వెళ్లిన వీరు.. ప్రమాదవశాత్తూ అక్కడ ఉన్న కరెంటు వైర్‌కు తగిలారు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై గంగారాం, బాలమణి, కిషన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం వేళ రైతు ప్రకాష్ రావు తన పొలం వద్దకు వెళ్లగా.. ముగ్గురు మృతదేహాలు పడి ఉండడంతో భయాందోళనకు గురయ్యాడు. విషయాన్ని వెంటనే పోలీసులకు తెలిపాడు. సమాచారం అందుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్ బాబులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న మృతుల కుటుంబీకులు పెద్ద సంఖ్యలో చేరుకొని బోరున విలపించారు. పొలం యజమాని ప్రకాష్‌రావు పందులను తరిమేందుకు రావాలని కోరినందు వల్లే ముగ్గురు ఇక్కడికి వచ్చారని మృతుల కుటుంబీకులు ఆరోపించారు. ప్రకాష్‌రావు మాటలు విని ఇక్కడికి రావడం వల్లే ముగ్గురు కరెంటు షాక్‌తో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయం జరిగే వరకు (తరువాయి 8వ పేజీలో..)




పంట పొలంలో పడిఉన్న మృతదేహాలు



మృతదేహాలను ఒడ్డుకు చేరుస్తున్న పోలీసులు

గన్నారంలో డబుల్ ఇళ్లు పూర్తయ్యేనా?

- నాలుగేళ్లుగా నిలిచిన పనులు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



.... వివరాలు 7లో



మహిమాన్వితం.. ఉప్లూర్ బాల రాజరాజేశ్వర స్వామి

- శతాబ్దాల చరిత్ర గల ఆలయం..
- రాతికట్టడాలతో ఆకర్షణీయం

.... వివరాలు 7లో

నగర పాలక సంస్థ ఆస్తి పన్ను వసూళ్లపై నజర్!



- ప్రత్యేక బృందాలతో ఆస్తి పన్ను వసూలు
- రావాల్సిన రూ.90 కోట్లకు ఇప్పటికీ వసూలైనవి రూ.27కోట్లు మాత్రమే
- పన్ను బకాయిలపై నోటీసుల అందజేత
- సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ అధికారులు ఆస్తి పన్ను వసూలుపై దృష్టి పెట్టారు. గత కొన్ని రోజులుగా ఆస్తి పన్ను వసూలు పై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. నగర పాలక సంస్థ ప్రధాన ఆదాయ వనరులైన ఆస్తిపన్ను ఎలాగైనా వసూలు చేయాలని అధికారులు ప్రత్యేక సమావేశాలు, సమీక్షలు నిర్వహించి ఆస్తిపన్ను వసూలుకు కార్యచరణ రూపొందించారు. నగర కమీషనర్ దిలీప్‌కుమార్, డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆస్తిపన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు. నగరంలో సుమారు 85 వేల గృహాలు ఉండగా వాటి ద్వారా సుమారు రూ.90 కోట్ల వరకు ఆదాయం సమకూరుస్తోంది. ఆస్తి పన్ను చెల్లించాల్సిన ఇంటి యజమానులకు మార్చి 31వరకు అవకాశం ఇచ్చారు. మార్చి 31లోపు ఆస్తి పన్ను చెల్లించకుంటే 2శాతం అధిక రుసుము చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు చాలా రోజులుగా ఆస్తిపన్ను బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో అలాంటి గృహాలపై, వ్యాపార సముదాయాలపై కఠిన చర్యలు తీసుకునే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికీ రూ.27కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చారు. మిగతా రూ.60 కోట్లను కూడా వసూలు చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. గృహాల యజమానులు విడతల వారిగా ఆస్తిపన్ను చెల్లించుకోవచ్చని అధికారులు తెలిపారు. జూన్ 31 నాటికి సగం ఆస్తి పన్ను, డిసెంబర్ 31 నాటికి మిగతా మొత్తాన్ని చెల్లించుకోవచ్చని తెలిపారు. మార్చి 31 తర్వాత చెల్లించిన వారికి 2 శాతం అధిక రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కొందరు నగర పాలక సంస్థ ఉద్యోగులు ఆస్తిపన్ను వసూలు చేయడానికి వెళ్లి గృహాల యజమానులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటివి జరుగకుండా ఉన్నతాధికారులు చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రత్యేక బృందాలతో ఆస్తిపన్ను వసూలు

నగరపాలక సంస్థలో 60 డివిజన్‌లు ఉండగా ఇందులో 85వేల గృహ, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీటి ద్వారా నగర పాలక సంస్థకు ఆదాయం వస్తోంది. ఈ ఆదాయాన్ని వసూలు చేసేందుకు నగర పాలక సంస్థ అధికారులు 60 డివిజన్‌లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. సుమారు 42 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. వీటితో పాటు 50 వేలకు పైగా బకాయిలు ఉన్న గృహాలు, వ్యాపార సముదాయాలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వీటిని సైతం వసూలు చేసే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరూ కనబడటం లేదు. ఉద్యోగులంతా ఆస్తిపన్ను వసూళ్లలో తలామునకలయ్యారు. ప్రత్యేక బృందాలలో అన్ని విభాగాల నుంచి ఉద్యోగులను తీసుకొని ఆస్తి పన్ను వసూలును చేస్తున్నారు. ఒక్కోక్క బృందానికి ఒక్క రోజుకు రూ.15 లక్షలు టార్గెట్‌గా నిర్ణయించారు. వీటి ప్రకారం ప్రతీ రోజు టార్గెట్‌కు అనుగుణంగా బృందాలు ఆస్తి పన్ను వసూలు చేస్తున్నాయి. దీన్ని డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు

- రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్, నగర పాలక సంస్థ నిజామాబాద్

ఇంటి పన్ను వసూలు చేయడానికి వచ్చిన నగర పాలక సిబ్బందికి గృహ యజమానులు సహకరించాలి. దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటాం. ఆస్తి పన్ను ఎప్పటికప్పుడు చెల్లించి నగర పాలక సంస్థ అభివృద్ధికి పాటుపడాలి. ప్రత్యేక బృందాలతో ఆస్తి పన్ను వసూలు చేపడుతున్నాం. ఇప్పటికే రూ.27 కోట్లకు పైగా వసూలు చేశాం.

మొండి బకాయిలకు నోటీసుల అందజేత

గత కొన్ని సంవత్సరాలుగా ఆస్తిపన్ను చెల్లించని గృహాలకు, వ్యాపార సముదాయాలపై నగర పాలక సంస్థ అధికారులు కఠిన చర్యలకు పూనుకుంటున్నారు. ఆస్తిపన్ను చెల్లించని గృహాలకు, వ్యాపార సముదాయాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. 15 రోజులలోపు ఆస్తిపన్ను చెల్లించాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని నోటీసులు అందజేశారు. ఇప్పటికే నగరంలో 25 శాతం నోటీసులు అందజేశారు. మిగతా వాటికి సైతం త్వరలో నోటీసులు అందజేసి ఆస్తిపన్ను చెల్లించని గృహాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



పసుపు కుప్పలను పరిశీలిస్తున్న పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

పసుపు రైతులకు నష్టం కలిగిస్తే సహించం

- పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

ఖిల్లా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించే పసుపు రైతులకు లాభాల కంటే నష్టాలే ఎక్కువగా వస్తున్నాయని, పసుపు కొనుగోలు చేసే వ్యాపారులు వారికి నష్టం కలిగించేలా క్రయవిక్రయాలు జరిపితే సహించబోమని పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పసుపు రైతులకు కలుగుతున్న మోసాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డితో కలిసి యార్డ్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా యార్డ్‌కు పసుపు తీసుకొచ్చిన రైతులతో మాట్లాడారు. ధరల విషయంపై వారిని అడిగితెలుసుకున్నారు. యార్డ్‌లో వసతులు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. యార్డ్‌లోని పసుపు రాసులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 4రోజులుగా వ్యవసాయ మార్కెట్‌లో రైతులు పసుపు అమ్మకానికి తీసుకొస్తే వ్యాపారులు మాత్రం సిండికేట్‌గా మారి వారిని నట్టేట ముంచుతున్నారని పేర్కొన్నారు. నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్ జిల్లాలకు చెందిన రైతులు ఎక్కువగా పసుపును పండిస్తారని అయినా పసుపుకు గిట్టుబాటు ధర ఇవ్వడంలో వ్యాపారులు మోసాలకు గురి చేయడం సమంజసం కాదని అన్నారు. జిల్లాలో అత్యధికంగా పండే పసుపును దృష్టిలో పెట్టుకుని దేశ ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ వ్యవసాయ మార్కెట్‌గా గుర్తించి ఈ-నామ్ విధానాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. రైతులు మోసాల పాలు కాకుండా ఉండేందుకు ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా కొనుగోలు చేయాలని వ్యాపారులు పారదర్శకంగా లావాదేవీలు నిర్వహించే అవకాశాలు ఉంటాయని ఈవిధానాన్ని అమలు చేశారన్నారు. అయినా వ్యాపారుల్లో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్ కాకుండా రైతులకు లాభేపేక్షంగా నడుచుకోవాలని అన్నారు. మార్కెట్ కమిటి అధికారులు యార్డ్‌కు వచ్చే రైతులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా కమీషన్ ఏజెంట్లు రైతులకు ఎటువంటి నష్టం కలిగించకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయనవెంట మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణ, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ కిషోర్ ఇనాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్ మల్లేష్, వ్యాపారస్తులు మాస్టర్ శంకర్, లాభిశెట్టి శ్రీనివాస్, సెల్లార్ కమిటీ అధ్యక్షుడు దేవేందర్, తారకవేణుగోపాల్, తొగర నారాయణ, బీజేపీ నాయకులు గంగోని గంగాధర్, రాజు ఉన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో ఉద్యోగుల సమ్మె



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగులు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలోని భారతీయ జీవిత బీమా సంస్థ కార్యాలయంలో గురువారం ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో గంటపాటు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బోధన్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సయ్య,రాజేష్ మాట్లాడుతూ 1996నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్‌మెంట్ అయిన వారందరికీ పాత పెన్షన్ స్కీమ్ వర్తింపజేయాలని, ఎంవో, జీవో 57 అమలు చేయాలని డిమాండ్ చేశారు.భారతీయ జీవితబీమా సంస్థ దేశప్రగతికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని, అటువంటి ప్రభుత్వరంగ సంస్థను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం వీడనాడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పొలంబాట పట్టిన విద్యుత్ శాఖ అధికారులు



జన్నేపల్లిలో పొలంబాట పట్టిన విద్యుత్ శాఖ అధికారులు

నవీపేట,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట పట్టారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ల లైన్లు, సర్వీసు వైర్ల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలు, కెపాసిటర్ల ఏర్పాటు అవశ్యకత, విద్యుత్ ప్రమాదాల జాగ్రత్తల గురించి అధికారులు వివరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 నెంబర్‌కు ఫోన్ చేయాలని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ రమేష్, నవీపేట ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్, సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కారోబార్ సంగమేశ్వర్

నవీపేట,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కారోబార్‌గా పని చేస్తున్న సంగమేశ్వర్ గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు తెలిపారు.మండలంలోని అబ్బాపూర్ నుంచి నవీపేట వైపు అతడు బైక్‌పై వస్తుండగా వెనుక నుండి వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో సంగమేశ్వర్ తలకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. వెంటనే అతనిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చేర్పించడం జరిగిందని స్థానికులు వివరించారు. ఈ విషయంపై ఎస్ఐ వినయ్‌ని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

సిద్దులగుట్ట సందర్శన



సిద్దులగుట్టపై పూజలు చేస్తున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన నవనాథ సిద్దులగుట్టను గురువారం మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్‌బుక్య సందర్శించారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డితో కలిసి పూజలు చేశారు. గుట్టపై గల సిద్దేశ్వర ఆలయం, రామాలయంలో ఎమ్మెల్యే పూజలు చేసి సిద్దులగుట్ట ఆలయ విశిష్టత, చరిత్రను ఎమ్మెల్యే మురళీ నాయక్‌కు ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపించిన వ్యక్తికి కోర్టు న్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణానికి చెందిన షేక్.హుస్సేన్ అనే వ్యక్తి బుధవారం మద్యంతాగి వాహనం నడిపిస్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకుని గురువారం కోర్టులో హాజరుపర్చగా కోర్టు న్యాయాధికారి శేషతల్ప సాయి ఒకరోజు జైలుశిక్ష విధించారని ఆయన తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని నిజామాబాద్ రోడ్ బృందావని థియేటర్ పక్కన గుర్తుతెలియని మహిళ(40) మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. బృందావని థియేటర్ పక్కన నూతనంగా నిర్మిస్తున్న భవనంలో ఫీడ్స్ వచ్చి సంప్‌లో పని చనిపోయినట్టు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని చిన్నమావంది గ్రామానికి చెందిన కారిడెకర్ గంగొండ అనే వ్యక్తి బుధవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై పెగడాపల్లి గ్రామానికి వచ్చి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కల్దుర్కి గ్రామానికి చెందిన ఉమాకాంత్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడని బోధన్‌రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.ఈఘటనలో గంగొండ అనే వ్యక్తిమృతి చెందినట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోదన్ ప్రభుత్వఆసుపత్రికి తరలించామన్నారు.మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవీపేట,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్(ఏ)శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను గురువారం పట్టుకోవడం జరిగిందని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తెలిపారు. ఇన్‌చార్జి సీపీ సీహెచ్ సింధూశర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ స్పెషల్ పార్టీ సిబ్బంది ఆధ్వర్యంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని నవీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఆయన వివరించారు. తదుపరి చర్యల నిమిత్తం టిప్పర్‌తో పాటు డ్రైవర్‌ను నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి అప్పగించడం జరిగిందని ఆయన వివరించారు.

'నిరుద్యోగులకు గోసపెట్టిన బీఆర్ఎస్, బీజేపీ'



భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

భీమ్‌గల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కల్పనలో విఫలమై నిరుద్యోగులను గోసపెట్టిన ఘనత బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలదేనని కార్పొరేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో సహస్ర పంక్షన్‌హాల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ హయంలో, ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీలు ఏ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటించకపోవడంతో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు కళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురుచూశారని కానీ ఉద్యోగాల ఊసే ఎత్తకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు బలి అయ్యారని అన్నారు. పార్టీ మరింత బలపడేందుకు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రతిపక్ష కార్యకర్త సైనికులలో పని చేసి బీఆర్ఎస్, బీజేపీ చేసిన ప్రజా వ్యతిరేక విధానాలను పట్టభద్రులకు తెలియజేసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య, ఎస్టీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, అనంతరావు, పీసీసీ డెలిగేట్ కుంట రమేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు నాగేంద్ర, చరణ్‌గౌడ్, మహిళ నాయకులు కల్పన, గంగామణి, పట్టభద్రులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో నిరుద్యోగుల నిరసన

కోటగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిరుద్యోగ యువకులు నిరసన వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితం ఆర్ఎస్ఈటిఐ డిచ్‌పల్లి వారి ఆధ్వర్యంలో పుట్ట గొడుగుల పెంపకం పై 24 మంది యువతి, యువకులు పుట్టగొడుగుల పెంపకం పై శిక్షణ పొందారు. శిక్షణ జూన్ 05- 2022 నుంచి జూన్ 25వ తేదీ వరకు ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన 24 మంది యువతి, యువకులు శిక్షణ పొందారు. శిక్షణ సమయంలో ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయలు ఉపకార వేతనం చెల్లించాల్సి ఉంది. శిక్షణ పూర్తి చేసిన యువకులకు కాకుండా ఇతర వ్యక్తులకు ఐదు వేల రూపాయల చొప్పున డబ్బులు రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పని చేయని వారికి డబ్బులు రావడం పై యువకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులను సంప్రదించగా క్షేత్ర స్థాయిలో సమర్పించిన జాబితా ఆధారంగానే డబ్బులు చెల్లించాలని చెప్పడంతో శిక్షణ పొందిన యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉన్నతాధికారులు స్పందించిన శిక్షణ పొందిన తమకు డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏపిఓ గంగారాంను వివరణ కోరగా ఆ సమయంలో తాను లేనని విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.



కోటగిరి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యువకులు

బాల్కొండ జూనియర్ కళాశాలలో ఫెయిర్‌వేల్



బాల్కొండ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ముప్కాల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజియోద్దిన్ అస్లం మాట్లాడుతూ ఎలాంటి దురాలవాట్లు, చెడు అలవాట్లు లేకుండా విద్యార్థులు క్రమశిక్షణ మెలిగి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కళాశాలో విద్యార్థినిలు పలు సాంస్కృతిక నృత్యాలు చేశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణు ప్రసాద్; కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ విధానాల ముసాయిదాను

ఉపసంహరించుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం జిల్లాకార్యదర్శి వెంకటేష్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వ్యవ సాయ మార్కెట్ విధానాల ముసాయిదాను ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడి పల్లిలో రైతుల నిరసన యాత్ర కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపా ధ్యక్షుడు భూమన్న, చిన్న రాజన్న, సాయన్న,నడ్పి గంగారాం, రాయుడు, నరేష్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

జొన్నలు, పసుపు పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

వేల్పూర్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): జొన్నలు, పసుపు పంటలను మద్దతు ధరతో ప్రభుత్వాలే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వేల్పూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, మండల పర్టీ అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి, జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జొన్నల వ్యాపారులు సిండికేట్‌గా మారి: ధరలు తగ్గిస్తున్నారని, అలాగే పసుపు కూడా మద్దతు ధర ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ ప్రకారం రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రైతుల నుంచి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలన్న విషయాన్ని గుర్తు చేశారు. నిజామాబాద్ మార్కెట్‌లో పసుపుకు మద్దతు ధర రాక రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ పాలకులు, అధికారులు ఎవరు కూడా పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. పసుపు రైతులను ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జొన్నలు, పసుపు పంటలను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అమ్రశాఖ అధ్యక్షుడు బబ్బురు ప్రతాప్‌రెడ్డి, నాయకులు రేగుల్ల రాములు, నల్ల రమేష్, నోముల రవందర్, ఏతేటి చిన్నారెడ్డి, బాలకిషన్, పిట్ల సత్యం, మొండి అశోక్, బాలయ్య, తదితరులు ఉన్నారు.



వేల్పూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆడ పిల్లల యొక్క లింగ నిష్పత్తి తగ్గుదలను అరికట్టాలి

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలకు, మగ పిల్లలకు సమాజంలో సమాన హక్కులు కల్పించబడ్డాయని అందుకే ఆడ పిల్లల యొక్క లింగ నిష్పత్తిని పెంచి లింగ నిష్పత్తి అరికట్టాలని ఐసీడీఎస్ భీమ్‌గల్ ప్రాజెక్టు సీడీపీవో స్వర్ణలత అన్నారు. గురువారం మండలంలోని గోనుగొప్పుల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళ శిశు దివ్యాంగుల, వయోవృద్దుల శాఖ, జిల్లా మహిళ, బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో పదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఐసీడీఎస్ భీమ్‌గల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, సౌమ్య, స్వప్న, అంగన్‌వాడీ టీచర్‌లు ప్రమీల, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కార్యశాల

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం, టీఎస్ ఏసీ వారి ఆధ్వర్యంలో గురువారం కళాశాల విద్యార్థులకు కార్యశాల నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణుప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు కరిక్యూలం విటయ్ రాయిటింగ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంచి ఉద్యోగం పొందడంలో సీవి. ప్రాముఖ్యతను, రెజ్యూ మధ్య గల బేదాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.వెంకటేశ్వర్‌రావు, ఎం.సునీత, అంబర్‌సింగ్, లింగన్న, వజీరభాను, అబ్దుల్‌రహమన్, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన

న్యూడెమోక్రసీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాకు గురువారం పట్టణంలోని వందలాది మంది న్యూడెమోక్రసీ నాయకులు తరలివెళ్లారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్యశివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 14నెలలు దాటిన పూర్తి స్థాయిలో ఆరుగ్యారెంటీలను అమలు చేయడంలేదని, 420 ఎన్నికల హామీలను కూడా అమలు చేయకుండా విద్య, వైద్య సౌకర్యాలను పేదప్రజలకు ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి, బీడీకార్మికులకు జీవనభృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ప్రిన్స్, రాహుల్,కళ్యాణ్, హుస్సెన్,సాయి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను గెలిపించాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జీ, హైదరాబాద్ కార్పొరేటర్ శ్రీరంగ నర్సింహగుప్తా ప్రజలను కోరారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, కమలానెహ్రూకాలనీ, ఆలూర్‌రోడ్‌లో పర్యటించి పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో మరింత అభివృద్ధి కొరకు మోదీ నాయకత్వంలో దేశం అగ్రగామిగా వెలుగుతుందని, నీతివంతమైన పాలన కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పాలెపు రాజు, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌యాదవ్, శంకర్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్మూర్ ఆర్టీసీ బస్‌డిపోలో

డయల్ యువర్ ఆఫీసర్

పెర్కిట్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం సాయంత్రం 4నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మూర్ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 9959226019 నెంబర్‌లో సమస్యలు తెలపాలని ఆయన కోరారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో నడిచే రాజధాని బస్సుల బేసిక్ టికెట్ చార్జీపై ఎనిమిది శాతం లహరి, నాన్ ఏసీ, స్లీపర్, సీటర్ బస్సులలో బెర్త్ కోసం టికెట్ చార్జీపై 4శాతం, లహరి ఏసీ సీటర్ కం స్లీపర్, సూపర్ లగ్జరీ బస్సులలో బేసిక్ టికెట్ చార్జీపై పది శాతం తగ్గింపును ప్రకటించిందని నిజామాబాద్ రిజినల్ మేనేజర్ జోష్న తెలిపారు. ప్రయాణికులకు ఉన్నత స్థాయి ప్రయాణాన్ని అందుబాటులో ఉంచడం, సౌకర్య వంతంగా చేయడం లక్ష్యంగా ఈ సదుపాయాలను ప్రవేశపెట్టినట్టు ఆమె తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తగ్గింపు టికెట్ చార్జీలతో సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని కోరారు. ముందస్తు రిజర్వేషన్ కొరకు మీ సమీప బస్ రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ బుక్ చేసే సౌకర్యం కలదని అన్నారు.

కస్తూర్బా పాఠశాలలో ఫిర్యాదుల బాక్సు

ముప్కాల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బ పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ వినోద తెలిపారు. విద్యార్థులు తమ సమస్యలను ఫిర్యాదుల పెట్టేలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ ప్రత్యేక అధికారిణి స్రవంతి, ఎంపీడీవో నరేష్ ఆనంద్; ఏవో సాయికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో గౌస్‌మోయినోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ



నవీపేట ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

నవీపేట,ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పురస్కరించుకుని ప్రజలు లేకుండా సమావేశాన్ని నిర్వహించారు. 01-04-2023నుండి 31-03- 2024వరకు మండలంలోని 32గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ సోషల్ ఆడిట్ నిర్వహించారు. రూ.3,70,12,952పనులపై ఈ సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలలోని చెరువులు, కాలువల పూడికతీత, కందకాల తవ్వకం, మొక్కల నాటడం, ఇంకుడు గుంతల తవ్వకం వంటి 349పనులపై అధికారులు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, ఎంపీడీవో నాగనాథ్, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎస్ఆర్‌పీ రాజు, ఏపీవో సంజీవ్, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తేలని శిఖం భూముల లెక్క

● శిఖం భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
● రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన ఇరిగేషన్ డీఈ



రెవెన్యూ, పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన ఉత్తరం

ఎడపల్లి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): శిఖం భూములు కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలనిఇరిగేషన్ డీఈ లోక్యానాయక్ రెవెన్యూ, పోలీసుఅధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు .జనవరి 30వ తేదీన తేలని శిఖం భూముల లెక్క అనే వార్త 'ఆంధ్రజ్యోతిలో' ప్రచురితమైంది.ఈవార్తపైవిచారణ చేపట్టిన అధికారులు ఎడపల్లి పెద్ద చెరువులో సుమారు 25మంది రైతులు శిఖం భూమిని కబ్జా చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. శిఖం ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు సంబంధిత అక్రమార్కులపై చర్యలు తీసుకుని శిఖం భూమిని కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సుంకెట్‌లో చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



సుంకెట్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మోర్తాడ్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట గ్రామంలో బుధవారం రాత్రి ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ వైభవంగా జరిగింది. గ్రామంలో ఉదయంఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని గ్రామ స్థులు, యువకులు భారీ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపు అనంతరం ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని గ్రామస్థుల సమక్షంలో కషాయ జెండాను ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ కడారి శ్రీనివాస్, మాజీఎంపీటీసీ ప్రశాంత్, తీగెల మల్లేష్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి



బట్టు నడ్పి రాజన్న (ఫైల్‌ఫోటో)

ముప్కాల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన బట్టు నడ్పి రాజన్న(60) చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్టు బాల్కొండ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం బస్సాపూర్ శివారులోని శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ చేపలు పట్టడానికి వెళ్లాడని, తెప్పనీటిలో బోరపడి తాను వేసిన వల చేతికి, శరీరానికి, కాళ్లకు చుట్టుకొని ఊపిరాడక రాజన్న మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో తోటి జాలర్‌లతో బ్యాక్‌వాటర్‌లో వెతకగా రాజన్న మృతదేహం లభ్యమైంది. గురువారం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని బాల్కొండ పోలీసులు తెలిపారు.

యంచలో 10మంది పేకాటరాయుళ్ల అరెస్టు



యంచలో పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు

నవీపేట,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి):మండలంలోని యంచ శివారులో గురువారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసి పేకాటఆడుతున్న 10మందిని పట్టుకోవడం జరిగిందని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తెలిపారు. ఇన్‌చార్జి సీపీ సీహెచ్ సింధూశర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ స్పెషల్ పార్టీ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 10మందిని పట్టుకుని వారివద్ద నుంచి 9సెల్‌ఫోన్లు,11ద్విచక్రవాహనాలతో పాటు రూ. 47,720 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం వారిని నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి అప్పగించడం జరిగిందని ఆయన వివరించారు.ఈపేకాట స్థావరంపై దాడి చేసిన సమయంలో మరో ఇద్దరు తప్పించుకున్నారని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు



బోధన్‌లో పేకాటరాయుళ్లను పట్టుకున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆటోనగర్ శివారులో రహస్య ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 10,500నగదును స్వాధీనం చేసుకున్నట్లు బోదన్ పట్టణ సీఐ వెంకట రమణ తెలిపారు. ఎవరైనా పేకాట ఆడిన, నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. పేకాట ఆడి ప్రజలు డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. పేకాట ఆడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పౌష్టికాహారంపై విద్యార్థినులకు అవగాహన



డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళాడిగ్రీ కళాశాలలో పౌష్టికాహారంపై విద్యార్థినులకు అవగాహన కల్పిం చినట్టు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక తెలిపారు. విద్యార్థినిలు ఎక్కువ నీళ్లు తాగాలని, ఆరోగ్యంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పౌష్టి కాహారాన్ని తీసుకోవాలని, వచ్చే వేసవికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకొని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పిర్దోస్ ఫాతిమ, హెల్త్ సూపర్‌వైజర్ సంతోషి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చైతన్యశాంతి, ఉపాధ్యా యులు శిరీష, ఉజ్మనిశాత్, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

వైద్య సేవలు వినియోగించుకోవాలి

● శ్రీలేఖ, పీహెచ్‌సీ వైద్యురాలు, డోంగ్లి



ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు ఉచితంగా అందించటానికి క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాయని వాటిలో పాల్గొని ప్రజలంతా సేవలు వినియోగించుకోవాలని డోంగ్లి మండల పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్నారా?

వైద్యురాలు: గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అన్ని వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ద్వారా 30 సంవత్సరాల వయసు దాటిన వారికి బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి వారికి తగిన మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం మహిళల కోసం ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి స్పందన ఎలా ఉంది?

వైద్యురాలు: ప్రతీ మంగళవారం డోంగ్లి పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మహిళలకు సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించి వైద్యం అందించడం జరుగుతుంది. వారికి పరీక్షలు నిర్వహించిన తరువాత అవసరమైతే జిల్లా కేంద్రానికి రిఫర్ చేస్తున్నాం. మహిళల నుంచి స్పందన కూడా బాగుంది. క్యాంపుకు అధిక సంఖ్యలో మహిళలు హాజరవుతున్నారు.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఆరోగ్య మహిళ క్యాంపు ద్వారా ఎంత మంది రోగులకు రీఫర్ చేశారు. రీఫర్ అయిన రోగులు రికవరీ అయ్యారా?

వైద్యురాలు: వారం వారం మహిళల కోసం ప్రత్యేకంగా క్యాంపు ఏర్పాటు ద్వారా 90 మంది రోగులకు జిల్లా కేంద్రానికి రిఫర్ చేయడం జరిగింది. వారిలో చాలా మంది మహిళలు రికవరీ అయ్యారు. ఇందులో బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న మహిళలు కూడా రికవరీ అయ్యారు.

ఆంధ్రజ్యోతి: గర్భిణుల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వైద్యురాలు: ప్రతీ సోమవారం, శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అత్యవసరం ఉన్న గర్భిణులకు జిల్లా కేంద్రానికి అంబులెన్స్‌లో పంపించడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: చిన్నారులకు సరైన సమయానికి టీకాలు వేస్తున్నారా?

వైద్యురాలు: తల్లిదండ్రులు మర్చిపోయిన మేము నమోదు చేసుకున్న రికార్డులను పరిశీలించి వారిని పిలిచి టీకాలు వేస్తున్నాం. వారం బుధవారం సబ్ సెంటర్ పరిధిలో టీకాలు వేయడం జరుగుతుంది. అలాగే శనివారం సబ్ సెంటర్ పరిధిలో ఉన్న గ్రామాలలో చిన్నారులకు టీకాలు వేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాలలో ఏ వ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నారు? వారికి ఎలాంటి వైద్యం అందజేస్తున్నారు?

వైద్యురాలు: గ్రామీణ ప్రాంతాల్లో తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్ టెస్టులు చేయగా బీపీ, షుగర్ ఉన్న వారే ఎక్కువగా ఉన్నట్లు నమోదు చేయడం జరిగింది. వారికి తగిన మందులు ఇస్తున్నాం.

● (ఆంధ్రజ్యోతి,మద్నూర్)

మున్సిపల్ పరిధిలో పోలీసు కవాతు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్ చౌరస్తా వరకు పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా 99 బెటాలియన్‌కు చెందిన వారు శాంతి భద్రతల కోసం కవాతు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నందిపేటలో

నందిపేట: మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా నందిపేట పోలీస్ శాఖ ఆద్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలు కవాతు నిర్వహించారు. వివేకానంద చౌరస్తా నుంచి ఐలమ్మ, అంబేద్కర్, నంది విగ్రహం, కొత్త బస్టాండ్, జామా మసీద్ మీదుగా గ్రామ పంచాయతీ కార్యాలయం, పాతూర్‌లోని శివాజీ విగ్రహం వరకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా శాంతి పరిరక్షణలో భాగంగా ఆర్‌ఏఎఫ్ బలగాలతో ప్రధాన వీధుల గుండా మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా శాంతి భద్రతలు బలంగా ఉంటే ప్రజాభివృద్ధి జరుగుతుందని, పల్లే టూరి ప్రాంతాల వాతావరణాన్ని తెలియజేసేందుకు కేంద్ర బలగాలతో ర్యాలీ నిర్వహించినట్లు ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాకీం పేటలోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ 99 బెటాలియన్ అధికారి వీరేంద్ర యాదవ్, స్థానిక ఎస్‌ఐ ఎం. చిరంజీవి, నాయకులు సిలిండర్ లింగం, మాజీ ఉప సర్పంచ్‌లు వాసరి రాంచందర్, భరత్, నాయకులు మాన్పూర్ భూమేష్, ఇమ్రాన్, నవీన్, నిఖిల్ తదితరులు ఉన్నారు.



నందిపేటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మోడల్ స్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



నవీపేట మోడల్ పాఠశాలలో వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

నవీపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో గురువారం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



నవీపేట మోడల్ పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భక్తి



గర్భగుడిలోని స్వయం భూలింగం



ఏళ్ల చరిత్ర గల రాతి కట్టడాలతో ఉప్లూర్ శివాలయం



గర్భగుడిలోని నాగేంద్రుడు

మహిమాన్వితం..ఉప్లూర్ బాల రాజరాజేశ్వర స్వామి

● రాతికట్టడాలతో ఆకర్షిస్తున్న చరిత్ర గల ఆలయం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామంలో కొలువై ఉన్న బాలరాజరాజేశ్వర స్వామిని గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, మండలాలు కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్ తదితర పొరుగు జిల్లాల వాసులు సైతం ఇష్టదైవంగా కొలుస్తారు. ప్రతీ సోమవారం ఆలయంలో పెద్ద సంఖ్యలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. కాగా ఆలయ నిర్వహణ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడ స్వామిని పెద్ద స్వామిగాను, ఉప్లూర్‌లో కొలువుదీరిన స్వామిని చిన్న స్వామిగా భక్తులు కొలుస్తారు. ఈ గ్రామంలో బాలరాజారాజేశ్వర స్వామిని ఇష్టదైవంగా కొలుస్తారు కనుకనే గతం నుంచి నేటి వరకు రాజేశ్వరస్వామి పేరు కలిసివచ్చేలా గ్రామస్థులు తమ పిల్లలకు పేర్లు పెడుతువస్తున్నారు. ఇదిలాఉండగా సంతాన భాగ్యంలేని దంపతులు ఈ ఆలయాన్ని వచ్చి మూడు రాత్రులు దైవసన్నిధిలో గడిపితే సంతానం కలుగుతుందన్నా ప్రగాఢ విశ్వాసం భక్తుల్లో ఉంది. రాజేశ్వర్, రాజేశుడు, చిన్న రాజేశ్వర్, పెద్ద రాజేశ్వర్, లింగమూర్తి, లింగమయ్య, రాజేందర్, శివ పేర్లు గల వ్యక్తులే ఈ గ్రామంలో అధికంగా కనిపిస్తారు ఏళ్ల చరిత్రగల ఈ ఆలయంలో. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఆలయంలో జాతర ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఐదు రోజుల పాటు గ్రామస్థులు ఉపవాస దీక్షలు పాటిస్తారు. కాగా శివభక్తులు మాలధారణతో నిష్టగా ఉంటారు. శివపంచాక్షరి జపం ఆచరిస్తారు.



ఆలయం ముందు నందీశ్వరుడు

అలయ నేపథ్యం

కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలోని ఈ ఆలయం ఈ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల కరీనగర్, ఆదిలాబాద్ జిల్లా ప్రజలు శ్రీ బాల రాజరాజేశ్వర స్వామిని ఇష్ట దైవంగా కొలుస్తారు. ఈ పుణ్యక్షేత్రం సౌరాణికంగా చాత్రకంగా పవిత్రతను సంతరించుకుంది. ఈ అలయం పూర్తిగా రాతి కట్టడంతో కూడుకుని ఉంది. గర్భగుడిలో కేవలం ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే కుర్చునే అవకాశం ఉంది. బాలరాజరాజేశ్వర స్వామి ఆలయంలోని గర్భగుడిలో భూమిలో స్వయం భూలింగంతో పాటు గణపతి, నాగేంద్రుడు నందీశ్వరుడు కొలువై ఉన్నారు. వేములవాడ రాజేశుడు పెద్ద స్వామిగా, ఉప్లూర్‌లో కొలువుదీరిన రాజేశుడు చిన్నస్వామిగా ఈ ప్రాంత వాసులు కొలుస్తారు. ఆలయ ముద్వారం సైతం రాతికట్టడంతో ఉండేది కొన్ని చోట్ల శిథిలమవ్వడంతో అప్పటి స్పీకర్ ప్రస్తుత రాజ్యసభ సభ్యులు కేతిరెడ్డి సురేష్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించడంతో ముఖద్వారం పునర్నిర్మించారు ఆలయం పక్కనే కోనేరుఉంది. పూర్వం ఇంద్రుడు వృత్తాసూరున్ని వధించిన అనంతరం బ్రహ్మహత్యాపాతకంతో బాధపడుతుండగాదేవ గురువు బృహస్పతి ఆదేశానుసారం ఉప్లూర్‌లోని బాలరాజరాజేశ్వర స్వామిని అర్చించి, అక్కడి నుంచి వేములవాడ పెద్ద స్వామి అలయం వద్ద వంద సంవత్సరాలు కఠోర తపస్సు చేసి తన పూర్వ శక్తిని తిరిగి పొందుతాడని పురాణగాథలు చెబుతాయి. ఉప్లూర్‌లోని ఈ ఆలయం క్రీ.శే.750 నుంచి క్రీ.శే. 900 మధ్య చాళుక్య రాజులు నిర్మించినట్లు ప్రాచుర్యంలో ఉంది. ఈ అలయ నిర్మాణంలో వాడిన రాతి కట్టడాలు అపురూప కళకు ప్రత్యేక నిదర్శనంగా నిలుస్తాయి.



మహా గణపతి విగ్రహం

విద్యుత్ శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన

● పిట్లం ఏడీఈ పరిధిలో అన్ని ఖాళీలే ● ఇన్‌చార్జీ అధికారులతో నెట్టుకొత్తున్న వైనం

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పిట్లం ఏడీఈ పరిధిలోని పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండలాలు ఉంటాయి. పిట్లం ఏడీఈతో పాటు నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్ మండలాలకు సంబంధించిన శాఖ పనులు చూసుకునేందుకు పిట్లం మండల కేంద్రంలో ఏడీఈ కార్యాలయం ఉంది. ఏడీఈ పరిధిలో మూడు మండలాలకు చెందిన ఏఈలు తమ కార్యాకలాపాలు నిర్వహిస్తారు. పిట్లం ఏడీఈ పరిధిలో ఉన్న వ్యవసాయ రంగం నాన్ కమాండ్ ఏరియా ప్రాంతంలోకి వస్తుంది. ఒక్క నిజాంసాగర్ మండలం మినహా రెండు మండలాల రైతన్నలు వ్యవసాయం కోసం బోరుబావులపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వేలాది వ్యవసాయ బోరుబావుల ద్వారా రైతన్నలు తమ పంట పొలాల్లో పంటలు పండిస్తున్నారు. అటువంటి ఈ ప్రాంతంలో వ్యవసాయానికి విద్యుత్ ముఖ్యమైన విభాగం. అటువంటి విభాగం పరిధిలో గల విద్యుత్ శాఖలో పిట్లం ఏడీఈ తో పాటు పెద్ద కొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండలాలకు చెందిన ఏఈ పోస్టులు ఆరు నెలలుగా ఖాళీగా ఉన్నాయి. గత ఆరు నెలల కిందట జరిగిన బదిలీల్లో భాగంగా పిట్లం ఏడీఈగా పనిచేస్తున్న రామక్రిష్ణ తిరుపతికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఈయనతో పాటు పిట్లం ఏఈగా పనిచేస్తున్న బుజ్జిబాబు కోటగిరికి, నిజాంసాగర్ ఏఈగా లక్ష్మణ్ పనిచేస్తున్న నిజామాబాద్‌కు, పెద్ద కొడప్‌గల్ ఏఈగా సబ్ ఇంజనీర్ సాయినాథ్ గౌడ్ బాధ్యతలు నిర్వహించగా బాన్స్‌వాడ డివిజన్‌కు బదిలీ అయ్యారు. దీంతో గత ఆరు నెలల నుంచి పిట్లం ఏడిఈ కార్యాలయం పరిధిలో అధికారులు లేక ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. ముఖ్యమైన పనులు కావాలనుకున్న తరుణంలో అధికారు లు లేక వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఏడీఈ పరిధిలో అంతా ఇన్‌చార్జిలే

పిట్లం ఏడీఈగా బాన్స్‌వాడ డివిజన్ కార్యాలయానికి చెందిన అరవింద్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, పిట్లం ఏఈగా మేనూర్ ఏఈ రమేష్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక నిజాంసాగర్ మండల ఏఈగా జుక్కల్ ఏఈ మహేష్ విధులు నిర్వహించగా, పెద్ద కొడప్‌గల్ ఏఈగా బిచ్కుంద ఏఈ పవన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటుగా పిట్లం ఏడిఈ కార్యాలయంలో సబ్ ఇంజనీర్‌తో పాటు, పిట్లం పెద్ద కొడప్‌గల్, నిజాం సాగర్ మండలాలకు చెందిన సబ్ ఇంజనీర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. దీంతో ఏదైనా విద్యుత్ వినియోగదారులకు అత్యవసరంగా పనులు ఉంటే ఇబ్బందులు ఎదురౌతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతానికి ఇన్‌చార్జి అధికారులు అందుబాటులో ఉంటున్న రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో కొంత ఇబ్బంది తలెత్తుతుందని వినియోగదారులు వాపోతున్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్, ఖాళీపోయిన విద్యుత్ ట్రాన్స్ పార్మర్ల మరమ్మతు వంటి పనులు చేసే సమయంలో రెగ్యులర్ అధికారులు ఉంటే బాగుంటుందని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఆరు నెలల నుంచి ఈ శాఖకు సంబంధించి ఇన్‌చార్జి అధికారులు పనులను పర్యవేక్షిణ చేస్తున్నారు. రానున్న రోజుల్లో వేసవికాలం అయినందున విద్యుత్‌కు మరింత డిమాండ్ పెరుగుతుంది. అటువంటి ముఖ్యమైన శాఖకు ఇన్‌చార్జీ అధికారులు కాకుండా రెగ్యులర్‌గా ఉండే అధికారుల ను నియమించాలని ఆయా మండలాల వినియోగదారులు కోరుతున్నారు.



పిట్లం మండల కేంద్రంలో గల ఏడీఈ కార్యాలయం

గన్నారంలో 'డబుల్' ఇళ్లు పూర్తయ్యేనా!?

● నాలుగేళ్లుగా నిలిచిన పనులు
● ఎదురు చూస్తున్న లబ్ధిదారులు



అర్ధాంతరంగా నిలిచిపోయిన డబుల్ ఇళ్ల నిర్మాణ పనులు

ఇందల్వాయి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో లబ్ధిదారులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. డబుల్ ఇళ్లు వస్తాయన్న ఆశ నిరాశగానే మిగిలింది. మండలంలోని గన్నారం శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన డబుల్ ఇళ్ల కోసం గత ప్రభుత్వ హయాంలోనే పనులను చేపట్టారు. 2021లో 50 మందికి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ డబుల్ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన నాలుగేళ్ల గడిచినా కేవలం స్లాబ్ లెవల్ వరకు పనులు చేసి కాంట్రాక్టర్ చేతులు ఎత్తేశారు. గంపెడు ఆశతో డబుల్ ఇళ్లు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలినట్లయ్యింది. మండలంలో ఒకే ఒక్క గన్నారం శివారులో డబుల్ ఇళ్ల పనులు చేపట్టిన నేటి వరకు పూర్తి కాలేదు. డబుల్ ఇళ్ల నిర్మాణం కోసం వందల సిమెంట్ సంచులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నేలమట్టం అయ్యాయి. ఎప్పుడు పనులు మొదలు పెడతారోనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డబుల్ ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వృథాగా పడి ఉన్న సిమెంట్ సంచులు

డబుల్ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నాం

● మంచోళ్ల సందీప్, గ్రామస్తుడు



నాకు ఇళ్లు లేదు. మా గ్రామంలో డబుల్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా. డబుల్ ఇళ్ల నిర్మాణం ఆపేశారు. ఎక్కడ ఉండాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

అద్దె ఇంట్లో ఉన్నా

● నీరడి ప్రమీల, గ్రామస్థురాలు



నాకెవరూ లేరు. అద్దె ఇంట్లో ఉంటున్నా. డబుల్ ఇళ్ల నిర్మాణం గన్నారం గ్రామంలో చేపడుతున్నారని దరఖాస్తు చేసుకున్నా. నాలుగేళ్ల గడిచింది. ఇంత వరకు ఇళ్ల నిర్మాణం పూర్తికాలేదు. డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను వేడుకుంటున్నా.

విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా

● మొన్న కలెక్టర్ రాకతో ఎక్కడికక్కడే గప్‌చుప్ ● నేడు యథేచ్ఛగా రవాణా ● సీఎం ఆదేశాలు బేఖాతరు

వర్ని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియాను అడ్డుకట్ట వేసేందుకు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఇసుక మాఫియాదారులకు మాత్రం సీఎం ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారు. జిల్లా ప్రథమ పౌరుడు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పర్యటనే ఇందుకు నిదర్శనం. బుధవారం పొతంగల్, కోటగిరి మండల కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేపట్టడంతో ఇసుక అక్రమ రవాణాదారులు ఎక్కడికక్కడే గప్‌చుప్‌గా మారి ట్రాక్టర్లను, టిప్పర్లను రహస్య ప్రాంతాల్లో దాచి పెట్టారు. ఆయన పర్యటన ముగియడంతో తిరిగి గురువారం తమ దందాను యథేచ్ఛగా కొనసాగించారు. పొతంగల్, హంగర్గ మంజీర పరివాహక ప్రాంతం నుంచి వందలాది ట్రాక్టర్ల ద్వారా కోటగిరి మండల పరిధి నుంచి రుద్రూరు, వర్ని మండలాలకు తెల్లవారు జామున నుంచి రాత్రి వరకు ఒక్కోసారి ఏకంగా పదేసి ట్రాక్టర్ల ద్వారా వందకు పైగా ట్రాక్టర్లతో ఇసుక రవాణాను కొనసాగించారు. ప్రభుత్వపరంగా అభివృద్ధి పనులు ఏమీ లేకున్నా బ్లాక్‌లో ఇసుక తరలించి ఒక్కో ట్రాక్టర్ ద్వారా రూ.4600కు పైగా డిమాండ్ పద్దతిలో అమ్మకాలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇంకా ప్రభుత్వం మంజూరు ఇచ్చినా నిధులు మాత్రం సమకూర్చ లేదు. దీంతో అక్రమ మార్గంలో ప్రభుత్వ భూముల్లో లే అవుట్లకు, అటవీ భూముల్లో కబ్జా ఇళ్లకు, వెంచర్లకు ఇసుకను అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇసుక మాఫియాను అరికట్టి ఉచిత ఇసుక రవాణాకు శ్రీకారం చుడితే మన రాష్ట్రంలో మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలకు భిన్నంగా అధికార యంత్రాంగం అక్రమ వ్యాపారులకు కొమ్మకాస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. రుద్రూరు సర్కిల్ పరిధిలోని వర్ని, రుద్రూరు, కోటగిరి పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇసుక మాఫియాను అడ్డుకోవడంలో రోజువారి మామూళ్లు దండుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులకు సమాచారం ఇస్తే రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వండని బదులివ్వడం వెనుక ఆయా శాఖల పనితీరు బహిర్గతం అవుతోంది. ఏదీ ఏమైనా ఇసుక అక్రమ దందాలో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఇకనైనా జిల్లా అధికార యంత్రాంగం ఇసుక మాఫియాను అడ్డుకోవడంలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పొతంగల్, కోటగిరి మార్గం ద్వారా రవాణా అవుతున్న ఇసుక


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి

సిరికొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాబోయే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ విద్యార్థులను సూచించారు. సిరికొండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మండలస్థాయి విజయ స్ఫూర్తి సమావేశానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంఈవో రాములు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో డీఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలంటే ఎలాంటి భయాందోళనకు గురికావద్దని ఆత్మన్యూనత భావాన్ని వీడనాడి పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన అన్నారు. పదవ తరగతి పరీక్షల్లో ర్యాంకుల కోసం విద్యార్థుల మధ్య పోటీ పెరగాలని సూచించారు. జక్రాన్‌పల్లి ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా సిద్ధపడాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు మహేందర్ మాట్లాడుతూ ఒక వ్యక్తి ఎదుగుతుంటే ఎంతో మంది ఎన్నో మాటలు మాట్లాడుతారని వాటిని పట్టించుకోకుండా ముందుకు వెళితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సిరికొండ ఎంఈవో రాములు, చీమన్‌పల్లి హెచ్‌ఎం శ్రీనివాస్, సుధాకర్, అర్వింద్, గణితం, భౌతికశాస్త్రం, ఆంగ్ల సబ్జెక్టుల లో విద్యార్థులకు ఉన్నటువంటి సందేహాలను నివృత్తి చేసి సులభంగా చదువుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గడ్డం రాజేష్‌రెడ్డి, ఎంపీవో తారాచంద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సతీష్, శ్రీకాంత్, రాజేశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పసుపు, ఎర్రజొన్న వ్యాపారులు తీరు మార్చుకోవాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): పంట చేతికి రాకముందే ఉన్న ధరను రైతులు పంటను మార్కెట్‌లోకి తెచ్చేసరికి ధరను తగ్గించి రైతులను ముంచుతున్నారని పసుపు, ఎర్రజొన్న వ్యాపారులు తమ తీరు మార్చుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రైతులను దోచుకునుడే అలవాటు చేసుకున్న కొందరు వ్యాపారులు అదే పనిగా పెట్టుకొని దోపిడీ చేస్తున్నారని పసుపు కొనుగోళ్లలో బయట వ్యాపారులు రాకుండా ఇక్కడి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రూ.13500ల నుంచి రూ.15 వేలు ఉన్న ధరను రూ.10వేలలోపు వచ్చేలా కుట్ర చేసి రైతుల ఉసురుపోసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదే పసుపు పక్కనఉన్న మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో రూ.15వేల ధర పలుకుతుంటే ఇక్కడెందుకు తక్కువగా ఉంటుందని, ఏదైనా తేడా ఉంటే వెయ్యి ఉండొచ్చు కానీ ఏ కంగా రూ.4వేల నుంచి 5వేలు తేడా ఉండటం వ్యాపారుల కుట్రల్లో భాగమేనని తెలిపారు. ఎర్రజొన్న వ్యాపారులు కూడా రూ. 4500 ఉన్న ధరను రూ.3700కు తగ్గించి రైతులను నిట్టనిలువునా దోపిడి చేస్తున్నారని, నేరుగా అక్కడక్కడ కమీషన్ ఏజెంట్లను పెట్టుకొని వారి ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఎర్రజొన్న వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరను పెంచకుండా కుట్రలు చేస్తున్నారని, జిల్లాలో మొక్కజొన్న సాగు పెరిగి ఎర్రజొన్న సాగు తగ్గిందని అయినా ధర పెంచడం లేదని చెప్పారు. రైతులు కూడా తొందరపడి పంటను అమ్మొద్దని, మన అవసరాన్ని ఆసరా చేసుకొని ధర తగ్గిస్తున్నారని తెలిపారు. పసుపు, ఎర్రజొన్న వ్యాపారులు తమ పద్ధతి మార్చుకోకపోతే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకునేలా సంబంధిత మంత్రితో మాట్లాడుతానని పేర్కొన్నారు.

టీయూలో శివాజీ జయంతి వేడుకలు


మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ సేవ ప్రముఖ్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ విశ్వవిద్యాలయంలో శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ సేవ ప్రముఖ్ బలవత్రి గణేష్ మాట్లాడుతూ యువత చత్రపతి శివాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ముఖ్య అతిథి అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులంతా చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని నిత్య జీవితంలో క్రమశిక్షణతో ధర్మాన్ని ఆచరిస్తూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు శివ, కమిటీ సభ్యులు సమీర్, మనోజ్, అక్షయ్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డిచ్‌పల్లి మండలంలోని బీబీపూర్ తండా శివారులోగల కేజీబీవీ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి యోవాన్, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల బోధన, భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.

బకాయిలు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

● ఈవో శ్రీనివాస్

దర్పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటిపన్ను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని దర్పల్లి ఈవో శ్రీనివాస్ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గురువారం గ్రామంలో ఇంటి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలోపు వంద శాతం పన్ను వసూలు లక్ష్యంగా గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయిలను వసూలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతీఒక్కరు తమ పన్నులను సిబ్బందికి చెల్లించాలని ఆయన సూచించారు. మార్చి వరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వంద శాతం పన్ను వసూలు లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన పీసీసీ చీఫ్


గంగాధర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్


మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నిర్మల హృదయ కాన్వెంట్ స్కూల్ ప్రతినిధులు

మాక్లూర్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగాధర్‌గౌడ్‌ను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ గురువారం పరామర్శించారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తన మిత్రుడైన గంగాధర్‌గౌడ్‌ను మహేష్‌కుమార్‌గౌడ్ ఆయన స్వగ్రామమైన అడవి మామిడిపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. యువజన కాంగ్రెస్ నుంచి తనతో పాటు పనిచేసిన గంగాధర్‌గౌడ్ అనారోగ్యబారిన పడిన విషయాన్ని తెలుసుకున్న మహేష్‌కుమార్‌గౌడ్ ఆయన నివాసానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నుడాచైర్మన్ కేశవేణు, శేఖర్‌గౌడ్, రత్నాకర్, తదితరులు ఉన్నారు.

మహేష్‌గౌడ్‌ను కలిసిన ఆసుపత్రి బృందం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌కు విచ్చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గురువారం ఆయన నివాసంలో వెల్నెస్ ఆసుపత్రి నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వెల్నెస్ ఆసుపత్రి వైస్‌ప్రెసిడెంట్ బోదు అశోక్ కుమార్, జనరల్ మేనేజర్ రాజేష్, మేనేజింగ్ డైరెక్టర్లు తాళ్ల సుమన్‌గౌడ్, అసద్‌ఖాన్, వివేకానందరెడ్డిలు ఆయనను సన్మానించారు. హైదరాబాద్‌లో ఆరు బ్రాంచ్‌లు ఉండగా నిజామాబాద్‌లో కొత్తగా బ్రాంచ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారిని మహేష్‌గౌడ్ అభినందించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలని సూచించారు.

త్వరలో నిర్మల హృదయకు వస్తా..

తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ పాఠశాలకు త్వరలోనే వస్తానని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం నిజామాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్మల హృదయ పాఠశాల ప్రతినిధులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాను చదువుకున్న పాఠశాలను త్వరలోనే సందర్శిస్తానని ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ దయాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కరస్పాండెంట్ డాక్టర్ యు.నిర్మల, రెవరెండ్ సిస్టర్ సరిత సింగారెడ్డి, ప్రైమరీ ఇంచార్జి రెవరెండ్ సిస్టర్ సురేఖ, ఉపాధ్యాయులు అనిత, జ్యోతి, రేష్మా, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు అపహరణ

ఖిల్లా, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును దుండగులు అపహరించినట్లు 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బోర్గాం(పి)కు చెందిన సుంకరి కళావతి ఇంటి ఆవరణలో కూర్చుని ఉండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలో ఉన్న సుమారు 9 గ్రాముల బంగారు గొలుసును అపహరించాడు. బాధితురాలి కుమారుడు హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. దుండగులను గుర్తించడానికి దొంగతనం జరిగిన తీరును నగర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రాజు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కాకతీయ విద్యార్థుల ఎంపిక

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు నగరంలోని సుభాష్‌నగర్‌లోగల కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు నవీన్, పాయల్‌శర్మలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తెలిపారు. వారిని విద్యాసంస్థల డైరెక్టర్లు రజినీకాంత్, రామోజీరావులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభచాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

పంటల క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షించాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ● రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎర్రజొన్న, తెల్లజొన్న, పసుపు పంటల అమ్మకాలు ప్రారంభమైనందున క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. పంట దిగుబడులను విక్రయించే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రేడర్లు, సీడ్స్ వ్యాపారులు మార్కెట్ రేటుకు అనుగుణంగా ధరను చెల్లిస్తూ రైతుల వద్ద నుంచి పంటను సేకరించేలా చూడాలన్నారు. జొన్న, పసుపు పంటల దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, ట్రేడర్లు, విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన జొన్న, పసుపు పంటల విస్తీర్ణం, పంట దిగుబడులు, ఎర్రజొన్న రైతులతో ఆయా కంపెనీల వ్యాపారులు కుదుర్చుకున్న ఒప్పందం, స్వేచ్ఛ విపనిలో ఆయా పంటలకు లభిస్తున్న ధర, మార్కెట్ డిమాండ్ తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులతో కుదుర్చుకున్న బైబాక్ ఒప్పందానికి కట్టుబడి తెల్లజొన్న, ఎర్రజొన్న కొనుగోలు జరగాలని రైతులు బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు ఇతర ట్రేడర్లకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తిస్వేచ్ఛ ఇవ్వాలని కలెక్టర్ సీడ్ వ్యాపారులకు సూచించారు. మార్చి నెల 15వ తేదీ వరకు మార్కెట్‌కు జొన్న, పసుపు పంట దిగుబడులు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా క్రయ విక్రయాలు జరిగేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పసుపు పంటను బాగా ఆరబెట్టి తీసుకొని వచ్చేలా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, తద్వారా పూర్తిస్థాయిలో వారు మార్కెట్‌కు డిమాండ్ మేరకు ధర పొందవచ్చని అన్నారు. తేమ శాతం కారణంగా రైతులు నష్టపోకూడదని సూచించారు. మార్కెట్ యార్డుకు పసుపు నిల్వలను రైతులు తీసుకొచ్చిన వెంటనే జాప్యానికి తావు లేకుండా వెంట వెంటనే తూకం జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పంటలు విక్రయించిన వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తక్షణమే తన దృష్టికి తేవాలని ఎక్కడ కూడా వ్యాపారులు కూలబల్కొని ధర తగ్గించారనే ఫిర్యాదులు రాకూడదన్నారు. మార్కెట్ డిమాండ్‌ను అనుసరిస్తూ రైతులకు పూర్తిస్థాయిలో ట్రేడర్లు ధర చెల్లిస్తున్నారా లేదా అన్నది పరిశీలించాలన్నారు. రైతులను మోసగించే చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించమని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగవ్వ, ఏడీఏలు, ఏవోలున్నారు.


పాఠశాలలో విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న కలెక్టర్

జ్యోతిబా పూలే పాఠశాలలో రాత్రి బస చేసిన కలెక్టర్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఎడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ పాఠశాలలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం రాత్రి బస చేశారు. పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల స్టడీ అవర్స్ కొనసాగుతుండడాన్ని గమనించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యాబోధన, రోజువారి దినచర్య, మెనూ తదితర వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ జైపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి, తహసీల్దార్ విఠల్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

సిరికొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాబోయే శాసనమండలి ఎన్నికల కోసం సిరికొండ ప్రాథమిక పాఠ శాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ రవీందర్‌రావు, ఎండీవో మనోహర్‌రెడ్డి, ఎస్సై ఎల్.రామ్ గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని సూచించారు.

'పట్టాలు ఇచ్చిన భూమిని లబ్ధిదారులు సాగు చేసుకునేందుకు సహకరించాలి'

సిరికొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరికొండలో భూమిని పొం దిన లబ్ధిదారులపై ఫారెస్టు అధికారుల దౌర్జన్యాన్ని అరికట్టాలని, లబ్ధి దారులు భూమిని సాగు చేసుకునేలా సహకరించాలని ఎమ్మెల్యే భూ పతిరెడ్డిని లబ్ధిదారులతో పాటు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలోకి తరలివెళ్లిన లబ్ధిదారులు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియేట్ సభ్యులు వి.ప్రభాకర్, రామకృష్ణ లబ్ధిదారుల సమస్యల ను ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వివరించారు. భూపతిరెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులకు న్యాయం జరిగేలా సహకరిస్తానని హామీఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ సిరికొండలో 532 సర్వేనెంబర్‌లో 2009లో సుమారు 200మందికి అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, పట్టాలు పొందిన లబ్ధిదారులు భూమిని చదును చేసుకుందామని ప్రయత్నిస్తే అటవీశాఖ అధికారులు అడ్డుకొని దౌర్జన్యం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు రమేష్, దామోదర్, బాబన్న, రమేష్, లబ్ధిదారులు జహీరాబీ, ముత్త, గంగవ్వ, గంగాధర్, స్వరూప, లక్ష్మీ ఉన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పట్టాలు పొందిన లబ్ధిదారులు

గుఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటి నిల్వలు

(5వ పేజీ తరువాయి)

పరిధిలో నీటి వినియోగం పెరిగింది. ప్రాజెక్టు నుంచి యాసంగి సాగుకు నీటి విడుదల సమయంలో ప్రాజెక్టులో 1091 అడుగులు 80.350 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 1077.50 అడుగులు 38.604 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 56 రోజుల్లో 42 టీఎంసీల నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. కాకతీయ, లక్ష్మీ, సరస్వతి కాల్వలతో పాటు వరద కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటిని తరలించారు. ప్రాజెక్టులో డెడ్‌స్టోరేజీ, తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీలు నిల్వ ఉంచుతారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల ప్రకారం మరో 28 టీఎంసీల నీటిని యాసంగి సాగుకు వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టుతోపాటు ఎల్‌ఎండీ, మిడ్‌మానేరులో ఉన్న నీటి నిల్వలను కూడా కాకతీయ కాల్వ పరిధిలోని స్టేజ్-1, స్టేజ్-2 ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు.

● ఆన్ ఆఫ్ పద్ధతిలో సరఫరా

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో సుమారు 12లక్షల ఎకరాలు సాగవడంతో అధికారులు పూర్తిస్థాయిలో అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూస్తున్నారు. ఎస్సారెస్పీ పరిధిలో మొత్తం వరి సాగు కావడంతో ఎక్కువ మొత్తంలో ఈ నీటి వినియోగం కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో రాష్ట్రస్థాయిలో ప్రాజెక్టుల పరిస్థితిపై సీఎం రేవంత్‌రెడ్డి వారం రోజుల క్రితం సమీక్షించారు. ప్రాజెక్టుల పరిస్థితిపై అధికారులతో చర్చించడంతోపాటు ఉన్న నీటినిల్వలకు అనుగుణంగా యాసంగి సాగు పూర్తయ్యే వరకు విడుదల చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా పంటలకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ఎస్సారెస్పీ పైనే తాగునీటికి ఆధారపడి ఐదు జిల్లాలు ఉన్నాయి.

● ఐదు జిల్లాల్లో తాగునీటికి..

ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచే తాగునీరు నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు సరఫరా అవుతోంది. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో వచ్చే జూలై వరకు తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటి నిల్వలు ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాలు మొదలయ్యేవరకు తాగునీటికి ఇబ్బంది లేకుండా సరఫరా చేయనున్నారు. ఈ ఐదు జిల్లాల పరిధిలో తాగునీటి కోసం రెండున్నర టీఎంసీల వరకు అవసరం ఉండటంతో యాసంగి సాగుకు నీటిని విడుదల చేయగా 10 టీఎంసీల వరకు నిల్వ ఉంచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎండలు పెరిగిన సమయంలో తాగునీరు కూడా ఎక్కువగా వినియోగించనుండటంతో ఆ రీతిలో చర్యలను చేపడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులతో చర్చించడంతోపాటు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా పంటలకు ఇబ్బందులు లేకుండా నీటిని విడుదల చేస్తున్నామని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి తెలిపారు. కాల్వల వెంట పర్యవేక్షించడంతోపాటు తాగునీటికి కూడా నీటిని అందిస్తున్నట్లు వారు తెలిపారు.

విషాదం

(5వ పేజీ తరువాయి)

మృతదేహాలను ఇక్కడి నుండి తరలించేది లేదని కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని బాధితులను సముదాయించే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న పలువురు ప్రజాప్రతినిధులు.. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. మరోవైపు.. పొలం యజమాని ప్రకాష్‌రావు మాట్లాడుతూ.. తనకు ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేదన్నారు. సంబంధిత వ్యక్తులతో తనకు ముఖ పరిచయం కూడా లేదని తెలిపాడు.

మృతదేహాలను తన భుజస్కందాలపై ఒడ్డుకు చేర్చిన సీఐ

విద్యుత్ షాక్‌తో పంట పొలంలో మృతి చెందిన ముగ్గురి మృతదేహాలను బోధన్‌రూరల్ సీఐ విజయ్ బాబు తన భుజస్కందాలపై ఒడ్డుకు చేర్చి మానవత్వాన్ని చాటుకున్నారు. తన సిబ్బందితో కలిసి మృతదేహాలను సుమారు 150 మీటర్లకు పైగా పంట పొలం నుంచి తీసుకొచ్చి ఒడ్డుకు చేర్చారు. అనంతరం మృతదేహాలను ట్రాక్టర్‌లో పోస్టుమార్టం నిమిత్తంనిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఘటనపై అన్ని కోణాల్లో విచారణ : బోధన్ ఏసీపీ శ్రీనివాస్

ముగ్గురు మృతి చెందిన ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్టు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. సాటాపూర్ నుంచి ముగ్గురు వ్యక్తులు పెగడాపల్లి వైపు ఎందుకు వచ్చారో అనే అంశంతో పాటు ఘటన జరిగిన ప్రాంతంలో విద్యుత్ షాక్ ప్రమాదవశాత్తు జరిగిందా? లేకుంటే విద్యుత్ వైర్లను కట్ చేసే ప్రయత్నంలో భాగంగా జరిగిందా!? అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతుల సెల్‌ఫోన్ల ఆధారంగా వివరాలు సేకరించి విచారణ జరుపుతామన్నారు. త్వరలోనే ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

విద్యుత్ వైర్లను కట్ చేయడంతోనే ప్రమాదం : బోధన్ ట్రాన్స్‌కో డీఈ

పంట పొలంలో విద్యుత్ వైర్లను కట్ చేయడంతోనే ఈ ఘటన జరిగినట్టు బోధన్ ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ అహ్మద్ తెలిపారు. ముగ్గురు వ్యక్తులు తడిగా ఉన్న కర్రకు కత్తిని కట్టి వేలాడుతున్న విద్యుత్ తీగలను కట్ చేసినట్లు చెప్పారు. కేబుల్ వైరు ఎత్తుకెళ్లాలన్న క్రమంలోనే వైర్‌ను కట్ చేశారన్నారు. ఈ క్రమంలోనే విద్యుత్ సరఫరా జరిగి ముగ్గురు చనిపోయినట్టు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. సంబంధిత వ్యక్తుల కుటుంబ సభ్యులు గతంలోనూ కేబుల్ వైర్లు దొంగిలించగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు డీఈ తెలిపారు. ఇందులో తమ శాఖ తప్పిదం ఏమీ లేదని ట్రాన్స్‌కో డీఈ స్పష్టం చేశారు.